సాక్షి ఒడిశా

బుధవారం ၊ 2 ၊ ఏప్రిల్ ၊ 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,94,903లు, బంగారం 15 గ్రాముల 150 మిల్లీగ్రాములు, వెండి 96 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పీఎల్ఆర్ వార్షికోత్సవం

పర్లాకిమిడి రైల్వేస్టేషన్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. చరిత్రను గుర్తు చేసుకున్నారు.

- 8లో..



ముగిసిన ఉగాది సంబరాలు

రాయగడలో ఉగాది సంబరాలు ముగిశాయి. ముగింపు ఆడంబరంగా జరిగింది.

- 8లో..

సుసంపన్న ఒడిశా లక్ష్యం



భువనేశ్వర్: ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

- సీఎం మోహన్‌చరణ్ మాఝి
- ఘనంగా రాష్ట్ర స్థాయి ఉత్కళ దినోత్సవం



భువనేశ్వర్: రాష్ట్ర స్థాయి ఉత్కళ దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి అభివాదం

భువనేశ్వర్: సుసంపన్నమైన ఒడిశా నిర్మిద్దామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రాష్ట్ర స్థాయి ఉత్కళ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక రాజ్‌భవన్ కూడలి ప్రాంతంలో ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మధుసూదన్ దాస్ జన్మస్థలం సత్యభామపూర్‌లో రాష్ట్ర స్థాయి ఉత్కళ దినోత్సవం వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష - సంస్కృతి విలువల పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి కొత్తగా ఒడియా భాషా పక్షం నిర్వహిస్తుందని ప్రకటించారు. ఏటా క్రమం తప్పకుండా ఏప్రిల్ 1 నుంచి 14 'ఒడియా పక్షం కార్యక్రమం కొనసాగుతుందని సభాముఖంగా వెల్లడించారు. మన గొప్ప ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయం, నృత్యం, సంగీతం తదితర రంగాల్లో ఔత్సాహికులకు ఆదరణ, ప్రోత్సాహం కోసం ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతికి గర్వ కారణంగా ప్రతి ఒడియా వ్యక్తి వృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు.

త్వరలో ఆయుష్మాన్ భారత్

రాష్ట్రంలో త్వరలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం ప్రవేశ పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రానున్న రెండు వారాల్లో రాష్ట్రంలో ఈ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలను అందించడం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 52 లక్షల మంది లబ్ధి పొందుతారని చెప్పారు. దేశ వ్యాప్తంగా 29,000కి పైగా ఆసుపత్రులలో వర్తింపజేయడం విశేషంగా పేర్కొన్నారు.



భువనేశ్వర్: సత్యభామపూర్‌లో ఉత్కళ దివస్ ఛాయా చిత్ర ప్రదర్శన తిలకిస్తున్న ముఖ్యమంత్రి

దేశాభివృద్ధిలో ఒడిశా భాగస్వామి..

భువనేశ్వర్: రాష్ట్ర పురోగతి నిరంతరం కొనసాగుతుందని, దేశ అభివృద్ధిలో ఒడిశా ముఖ్యమైన పాత్ర పోషించి ప్రముఖ భాగస్వామిగా నిలుస్తుందని రాష్ట్ర విపక్షం బిజు జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ పాలనలో బలమైన మౌలిక సదుపాయాల్ని పుష్కలంగా కల్పించినట్లు గుర్తు చేశారు. బిజు జనతా దళ్ పాలనలో రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గిందని చెప్పారు. 2000 నుంచి 2024 సమగ్రంగా 24 సంవత్సరాలను ఒడిశా అభివృద్ధిలో సరి కొత్త యుగంగా అభివర్ణించారు. స్థానిక బిజు జనతా దళ్ ప్రధాన కార్యాలయ సముదాయం శంఖ భవన్‌లో ఈ మేరకు ఉత్కళ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ భాషావేత్త దేబీ ప్రసన్న పట్నాయక్, జార్ఖండ్ మాజీ మంత్రి డాక్టర్ దినేష్ షడంగి తదితర ప్రముఖులను ఉత్కళ దివస్ సత్కారంతో అభినందించారు.



భువనేశ్వర్: శంఖ భవన్‌లో బీజేడీ నిర్వహించిన ఉత్కళ దివస్ వేడుకల్లో నవీన్ పట్నాయక్, భాషావేత్త దేబీ ప్రసన్న పట్నాయక్



భువనేశ్వర్: భాషావేత్త దేబీ ప్రసన్న పట్నాయక్‌కు బీజేడీ అధ్యక్షుని సత్కారం

న్యూస్‌రీల్

పూరీ రథయాత్రకు మరో గుర్తింపు

భువనేశ్వర్: విశ్వ విఖ్యాత పూరీ శ్రీ జగన్నాథుని వార్షిక రథ యాత్ర జాతీయ ప్రతిష్టాత్మక సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ ఇన్వెంటరీ ఆఫ్ ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో స్థానం దక్కించుకుంది. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర అరవింద కుమార్ పాఢి ఈ విషయం తెలియజేశారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ అధీనంలో భారత దేశ అత్యున్నత సాంస్కృతిక సంస్థ సంగీత నాటక అకాడమీ పూరీ శ్రీ జగన్నాథుని రథ యాత్ర, బాలి జాతరలను నేషనల్ ఇన్వెంటరీ ఆఫ్ ఇంటాంగిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో చేర్చిందని తెలిపారు. శ్రీ జగన్నాథుని వార్షిక రథ యాత్రకు యునెస్కో అవ్యక్త సాంస్కృతిక వారసత్వ గుర్తింపు కోసం శ్రీ మందిరం పాలక మండలి చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర సాంస్కృతిక శాఖకు నామినేషన్ దస్తావేజుల్ని దాఖలు చేసినట్లు శ్రీ మందిరం సీఏఓ పేర్కొన్నారు.

చలువ పందిళ్లు ఏర్పాటు



ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

భువనేశ్వర్: వేసవి తాపం నుంచి వాహన చోదకులకు ఉపశమనం కల్పించేందుకు నగర పాలక సంస్థ బీఎంసీ నడుం బిగించింది. పగటి పూట ఎండ సమయంలో రద్దీ నియంత్రణలో భాగంగా ట్రాఫిక్ కూడలి ప్రాంతాల్లో నిలకడగా కాసేపు ఆగాల్సి వస్తుంది. ఈ సమయంలో వాహన చోదకులకు ఎండ వేడిమి నుంచి ఉపశమన కల్పించేందుకు ప్రధాన ట్రాఫిక్ కూడలి ప్రాంగణాల్లో బీఎంసీ చలువ పందిళ్లు ఏర్పాటు చేసి నగరవాసుల మన్ననలు పొందింది.

విరజామాత పీఠంలోకి విదేశీయుల ప్రవేశం!



జాజ్‌పూర్ విరజా మాత పీఠంలో విదేశీయులు

భువనేశ్వర్: అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటిగా పేరొందిన జాజ్‌పూర్ విరజా మాత పీఠం అత్యంత పవిత్రమైనది. శక్తివంతమైనది. ఈ ప్రాంగణం లోనికి విదేశీయలు విచ్చల విడిగా ప్రవేశించారు. దీంతో సాధారణ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మహిళలతో సుమారు 10 మంది విదేశీయులు ఆలయ సముదాయంలోనికి మంగళవారం బలవంతంగా ప్రవేశించినట్లు సమాచారం. వీరంతా ఆలయ ప్రాంగణంలో స్వేచ్ఛగా తిరుగాడుతు తారసపడ్డారు. ఈ సంఘటన స్థానిక భక్తులలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. విదేశీ పర్యాటకులు ఆలయ ప్రాంగణం లోనికి ప్రవేశించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిని పంపించే ప్రయత్నంలో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఆలయ సముదాయంలోనికి విదేశీయులు ప్రవేశించకుండా ఆలయ పూజారులు అడ్డుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



బస్సు కింద నుజ్జయిన వాహనం

రాయగడ: రోడ్డు ప్రమాదంలో 14 ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి పూజారిగుడ పంచాయతీ పరిధి రవుతోపారిటిగుడ కూడలి వద్ద మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమన్ క్రడక మృతి చెందినట్టు పోలీసులు వెల్లడించారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనంతో సుమన్ అతని స్నేహితుడు కలిసి పారిటిగుడ గ్రామం నుంచి వెళ్తుండగా రవుతోపారిటిగుడ కూడలి వద్ద వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో వాహనాన్ని నడుపుతున్న సుమన్ బస్సు కిందపడిపోవడంతో అక్కడే ప్రాణాలు కోల్పోగా.. అతని స్నేహితుడు సురక్షితంగా ప్రాణాలతో బయట పడ్డాడు.మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నపోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొడుకుని కోల్పోయిన కన్నవారు కన్నీరుమున్నీరుగా రోదించారు. బస్సు యజమాని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

రాయగడలో..



రాయగడ: గజపతి విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రి హిమిరిక, తదితరులు



రాయగడ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సరస్వతి మాఝి. పక్కనే కలక్టర్ పట్నాయి తదితరులు



రాయగడ: ఒడిస్సీ నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

రాయగడ: రాష్ట్ర 90 వ అవతరణ దినోత్సవాన్ని జిల్లా యంత్రాంగం మంగళవారం ఘనంగా జరుపుకుంది. గజపతి కూడలి నుంచి ర్యాలీ నిర్వహించి గాంధీ పార్క్ వద్ద అమర వీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక బిజుపట్నాయక్ ఆడిటోరియంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాలను పురష్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, బీజేడీ నాయకులు దూడల శ్రీనివాస్, బనాఘటి తిరుపతి , రాయగడ సమితి అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులుగజపతి కూడలిలోని మహారాజ కృష్ణచంద్ర గజపతి విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉత్కళ దివాస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే రాజకీయ పార్టీలు, అధికారులు ప్రముఖులు విగ్రహాలకు నివాళులు అర్పించారు. సాహితీ సంస్థలు ఉత్కళ భాష ప్రాముఖ్యతపై సదస్సులు నిర్వహించాయి.



కొరాపుట్: ఉమ్మర్‌కోట్‌లో రాబిన్ సింగ్ మఝి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యా మంత్రి నిత్యానంద గొందో



కొరాపుట్: ప్రముఖులు విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న కేసీసీ బ్యాంక్ ప్రెసిడెంట్ ఈశ్వర్ పాణిగ్రాహి, మాజీ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, మున్సిపల్ చైర్మన్ లలిత్ శెఠి



కొరాపుట్: నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వీ.కీర్తి వాసన్, జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక, ఎమ్మెల్యే రఘురాం మచ్చో



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో బిజు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ ప్రదీప్ మఝి, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో సుభాష్ బోస్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి



నబరంగ్‌పూర్‌లో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ శుభకంర్ మహాపాత్రో

జయపురంలో..

జయపురం: జయపురంలో ఉత్కళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జయపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఒడిశా ప్రథమ న్యాయవాది ఉత్కళ గౌరవ మధుసూదనదాస్ విగ్రహానికి కొరాపుట్ జిల్లా బార్ అషోషియేషన్ అధ్యక్షుడు సరోజ్‌దాస్, కార్యదర్శి సచ్చిదానంద మిశ్ర, ఉపాధ్యక్షులు నబీన సాహు, కోశాధికారి రామానుజం, గ్రంథాలయ కార్యదర్శి పట్నాయిక్, సు. దీర్ త్రిపాఠీ, తరణి పాణిగ్రహి సహదేవ్ పటాన్నయిక్ తదితరులు నివాళులు అర్పించారు.



జయపురం: జిల్లా కోర్టు ప్రాంగణంలో మధుసూదన దాస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు



జయపురం: మధుబాబుకు పూలమాలలు వేస్తున్న సబ్ కలెక్టర్ కుమారి రెడ్డి



కొఠియాలో వేదిక మీద సీఎల్పీ నాయకుడు రాం ఖడం, కలెక్టర్ వీ.కీర్తి వాసన్, ఎమ్మెల్యే రఘురాం, మాజీ ఎంపీ జయరాం పంగి తదితరులు

కొఠియాలో..

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొఠియాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్కళ దివస్ వేడుకలు జరిపింది. మంగళవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీ నడి బొడ్డున పార్టీలకు అతీతంగా రాజకీయ పక్షాలతో కలసి జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఘనంగా జరిపింది. కార్యక్రమంలో రాష్ట్ర సీఎల్‌పీ నాయకుడు, పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం, కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, మాజీ ఎంపీ జయరాం పంగి,మాజీ ఎంఎల్ఎ ప్రఫుల్ల పంగిలు పాల్గొన్నారు. నేరడివలసలో జగన్నాథ విగ్రహాన్ని కొఠియాలో ఊరేగించారు.



వలసలో జగన్నాథ విగ్రహంతో ప్రజల ఊరేగింపు



తాడివలసలో సంకీర్తన మండళ్లు ప్రచారం

బీజేడీ ఆధ్వర్యంలో..



బిజు పట్నాయక్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా బీజేడీ నేతలు

మల్కన్‌గిరి : జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న బిజు పట్నాయక్ విగ్రహం వద్ద జిల్లా బీజేడీ పార్టీ సభ్యులు మంగళవారం ఒడిశా 90వ దినోత్సవాలు నిర్వహించారు. బిజూ పట్నాయక్ పోరాటాన్ని గుర్తు చేశారు.



అతిథుల ఎదుట నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



గోపబాంధు దాస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో పాతకలేక్టర్ కార్యాలయంలో ఒడిశా దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ యోధుల విగ్రహాలకు నివాళులర్పించారు. పమ్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి పాల్గొన్నారు. స్వాతంత్ర్యానికి ముందే ఒడిశా భాషా ప్రాతిపదికన ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యార్థులు ఉత్కళ జననీ గీతాన్ని ఆలపించారు.

జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

జయపురం: జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్కళ దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేక ఉత్కళ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమ రథసారధుల చిత్ర పటాలకు నివాళులు అర్పించిన వక్తలు విద్యార్థులకు ఉత్కళ సమ్మిళిణీ ఉద్యమ వివరాలు వివరించారు.



ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ రథసారధులు



పాఠశాలలో ఉత్కళ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

విద్యారంభ యజ్ఞం


జట్నీ సరస్వతి శిశు విద్యా మందిరం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కలశ యాత్ర


విద్యా మందిరం ప్రాంగణంలో విద్యారంభ యజ్ఞం

భువనేశ్వర్: రాష్ట్రంలో ఏటా ఏప్రిల్ నెల ఆరంభం ఒకటో తేదీ ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఆర్థిక సంవత్సరం ఆరంభానికి పరిమితం కాకుండా చారిత్రాత్మక, విజ్ఞానాత్మక ప్రాధాన్యత కూడగట్టుకుంటుంది. ఏప్రిల్ నెల ఒకటో తేదీ నుంచి ఏటా రాష్ట్ర అవతరణ దినోత్సవం ఉత్కళ దివస్ వాడవాడలా జరుపుకుని చారిత్రాత్మక ప్రాధాన్యత చాటుతారు. ఇటీవల కాలంలో ఏప్రిల్ ఆరంభం నుంచి విద్యార్థులకు కొత్త తరగతుల్లో పాఠ్యాంశాల బోధనకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక విద్యా సంస్థల్లో విద్యారంభ యజ్ఞం, హోమాదులతో పాఠశాలల్లో కొత్తగా చేరే పిల్లలకు అక్షరభ్యాసం అత్యంత సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విద్యా సంస్థల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఉమ్మడిగా ఈ కార్యక్రమాల్ని పిల్లల సమక్షంలో నిర్వహించి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. సరస్వతి శిశు విద్యా మందిరం గ్రూపు సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా భారతి శిక్ష్యా వికాస్ సమితి ఆధ్వర్యంలో ప్రవేశ దినోత్సవం, విద్యారంభ యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ధనుంజయ్ మ్యూజికల్ నైట్‌లో పాటలతో అలరిస్తున్న గాయకులు

రాయగడ: కొల్లిగుడలో యాల్ల కొండబాబు ఆధ్వర్యంలో ఉత్కళ తెలుగు సమాఖ్య పేరిట రెండు రోజులు జరిగిన ఉగాది ఉత్సవాలు సోమవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. జబర్దస్త్ ఫేమ్ కళాకారుడు హైపర్ ఆది బృందం హాస్యంతో అందరిని అలరించారు. సినీ నేపథ్య గాయకుడు ధనుంజయ్ మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను పసందైన పాటలతో ఆనంద డోలికల్లో ముంచెత్తింది. అనంతరం నృత్య ప్రదర్శనలు తెలుగు సంప్రదాయాలకు నిలువెత్తుగా నిలిచాయి. ఈ సందర్భంగా రాయగడ జిల్లా తెలుగు సమాఖ్య అధ్యక్షుడు కొండబాబు మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా సమాఖ్య ఆధ్వర్యంలో జరుపుతున్న ఉగాది వేడుకలకు జనం తరలివచ్చి తమకు సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. మున్ముందు కూడా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఆడంబరంగా పీఎల్ఆర్ వార్షికోత్సవం


విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న సీనియర్ డీసీఎం కె.పవన్ కుమార్

పర్లాకిమిడి: ఈస్టుకోస్టు వాల్తేరు డివిజన్ పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌లో పి.ఎల్.ఆర్ (పర్లాకిమిడి లైట్ రైల్వే) 120వ వార్షికోత్సవాలు మంగళవారం ఆడంబరంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా సీనియర్ డి.సి.యం.2 కె. పవన్ కుమార్ (వాల్తేరు డివిజన్), పి.ఆర్.ఓ. జయరాం ఇతర రైల్వే అధికారులు పాల్గొన్నారు. తొలి ప్రైవేటు రైల్వే లైను 1898లో పర్లాకిమిడి మహారాజా గౌరచంద్ర గజపతి తొలుత పర్లాకిమిడి నుంచి నౌపడకు పి.ఎల్.ఆర్. రైలు బండిని ప్రవేశపెట్టాలన్న ప్రపోజల్‌ను బ్రిటీష్ ప్రభుత్వానికి విన్నవించగా, ఏప్రిల్ 1, 1990లో న్యారోగేజి లైన్‌ను 40 కిలో మీటర్లు ప్రవేశపెట్టారని డి.సి.యం పవన్ కుమార్ అన్నారు. 1931లో మహారాజా కృష్ణచంద్రగజపతి పర్లాకిమిడి నుండి గుణుపురానికి (51 కి.మీ.)లైను ప్రవేశపెట్టారు. స్థానిక ప్రజలు, మాజీ ఎం.పి. గోపినాథ గజపతి నారాయణదేవ్ అనేక ఆందోళనల మేరకు 2002, సెప్టెంబరు 27లో ఈస్టుకోస్టు రైల్వే బ్రాడ్‌గేజీ కోసం శిలాఫలకం వేశారు. బ్రాడ్‌గ్యాజిగా మారిన తర్వాత 2011లో గుణుపురం నుంచి నౌపడకు తొలి ప్యాసింజరు రైలుబండిని ఈస్టుకోస్టు రైల్వే (వాల్తేరు) నడిపారు. ఈ మధ్య అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా పర్లాకిమిడి స్టేషన్‌లో నూతనంగా వైఫై, కొత్త ప్లాట్‌ఫారం, ఓవర్ ఫుట్ బ్రిడ్జి తదితర సౌకర్యాలతో ప్రారంభానికి సిద్ధమవుతోందని పీఆర్‌ఓ జయరాం అన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్లాకిమిడి రైల్వేస్టేషన్ హెరిటేజ్ టు డెవలప్‌మెంట్ అంశంపై వక్తృత్వ, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. వాల్తేరు ఈస్టుకోస్టు రైల్వే అధికారులు పర్లాకిమిడి పి.ఎల్.ఆర్.120 వార్షికోత్సవాల సందర్భంగా చారిత్రాత్మక పర్లాకిమిడి స్టేషన్ కరపత్రం, బ్రోచర్లను విడుదల చేశారు.

గజపతి జిల్లాలో
వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ముఖేష్ మహాలింగ, మోహనా, పర్లాకిమిడి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తదితరులు

● వైద్యశాఖమంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర వ్యాపార, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ అన్నారు. ఒడిశా స్వతంత్ర రాష్ట్రం ఏర్పాటుకు స్వర్గీయ పర్లాకిమిడి మహారాజా శ్రీకృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ చేసిన కృషి సఫలీకృతమై చరిత్రలో మిగిలిపోయారని అన్నారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్ర హాలులో మంగళవారం జరిగిన ఒడిశా ఉత్కళ దివాస్ ఉత్సవాలకు మంత్రి ముఖేష్ మహాలింగ ముఖ్యఅతిథిగా మాట్లాడారు.

రాష్ట్రంలో ఆరు మెడికల్ కళాశాలల ఏర్పాటుకు ముఖ్యమంత్రి మోహన్ మఝి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, పర్లాకిమిడిలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవించి ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. గజపతి జిల్లాలో పర్యాటక కేంద్రాలైన చంద్రగిరి, మహేంద్రగిరి, గండాహాతి అభివృద్ధికి ముఖ్యమంత్రి మోహన్ మఝి నిధులు విడుదల చేశారన్నారు. అలాగే గజపతి జిల్లాలో ఒడియా అస్మితాభవన్ నిర్మాణం జరుగుతుందని, ఇందులో ఒడిశా కళా, సంస్కృతి, మహారాజా సంగ్రహాలయం ఉంటాయని అన్నారు. రాష్ట్రంలో మహిళలు శక్తివంతులని వారికి సుభద్ర పథకం వర్తింపజేసి ఆర్థిక స్థిరత్వం తెచ్చామని మంత్రి మహాలింగ అన్నారు. ఈ సందర్భంగా ఒడియా ప్రీతికరమైన వంటల పోటీలో విజేతలైన మహిళలకు మంత్రి బహుమతలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి, జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర పండా, ఏడీఎం రాజేంద్ర మింజ్, ఉత్కళహితేషినీ కార్యదర్శి పూర్ణచంద్ర మహాపాత్రో పాల్గొన్నారు.


శ్రీకృష్ణచంద్ర గజపతికి నివాళులర్పిస్తున్న మంత్రి ముఖేష్ మహాలింగ


వంటల పోటీలలో విజేతలకు బహుమతి అందజేస్తున్న మంత్రి ముఖేష్ మహాలింగ


మంత్రి ముఖేష్ మహాలింగకు కొమ్ముతో చేసిన జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

విక్రమదేవ్ వర్మ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి


సాహిత్య సామ్రాట్ విక్రమదేవ్ స్మృతి సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: బహుముఖ ప్రజ్ఞాశాలి విక్రమదేవ్ వర్మ జీవితం, కీర్తిపై పరిశోధన కేంద్రాన్ని స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేయాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ఎల్-2 భవనంలో రాష్ట్ర ఒడియా భాష, సంస్కృతి, సాహిత్య విభాగం భువనేశ్వర్, ఒడియా సంగీత నాటక అకాడమి, జయపురం సాహిత్య పరిషత్‌లు సంయుక్తంగా నిర్వహించిన సాహిత్య సామ్రాట్ విక్రమదేవ్ వర్మ స్మృతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జయపురం సాహితీ పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని కులపతి మహేశ్వర్ నాయిక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాహిణీపతి మాట్లాడుతూ రాష్ట్రానికే కీర్తి కిరీటం అయిన విక్రమదేవ్ వర్మ చరిత్రను పాఠ్యాంశంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్ర విధాన సభలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తాను విధానసభలో ప్రస్తావించానని ఆయన వెల్లడించారు. ప్రముఖ సంగీత కళాకారుడు ధిరెణ్ మోహణ పట్నాయిక్, నేత్వంలో శతి పట్నాయిక్, బిశ్వజిత్ దాస్, ప్రాంశుశిబ దాస్‌ల సంగీత కార్యక్రమంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మరో కళాకారుడు జి.మహేష్ ఫ్లూట్ వాయిద్యంతో సభికులను అలరించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా విక్రమదేవ్ విశ్వవిద్యాలయ కులపతి మహేశ్వర చంద్ర నాయిక్ పాల్గొని రాజర్షి విక్రమదేవ్ వర్మ చరిత్రను విపులీకరించారు. మీరాడ్యాన్స్ గ్రూపు నృత్యాలు, ఒడిశీ నృత్యాలతో వీక్షకులను ఉర్రూతలూగించారు. గాయకురాలు బిద్యుత్ ప్రభ పట్నాయిక్ సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్యమంత్రి పోషణ యోజన ప్రారంభం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి నిత్యానంద గొండో

కొరాపుట్: ముఖ్యమంత్రి పోషణ యోజన పథకాన్ని రాష్ట్ర ప్రాథమిక విద్యా, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో మంగళవారం ప్రారంభించారు. సొంత నియోజకవర్గం ఉమ్మర్‌కోట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఈ పథకాన్ని ప్రారంభించి 9, 10వ తరగతి విద్యార్థులతో కలిసి మధ్యహ్న భోజనం చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 10 లక్షల 80 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ భోజనంలో రాగి లడ్డూను వారం రోజులపాటు అందజేస్తారన్నారు. దీని వలన పోషక విలువలు పెరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలు చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ పథకాన్ని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఘనంగా పోలీసు వ్యవస్థాపక దినోత్సవం


పోలీస్ పరేడ్ తిలకిస్తున్న నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో

పర్లాకిమిడి: రాష్ట్ర పోలీసు విభాగం 90వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బెత్తగుడ మూడో ఆర్మ్‌డ్ పోలీసు బెటాలియన్ మైదానంలో ఉత్కళ దివాస్ సందర్భంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ జితేంద్ర నాథ్ పండా, అదనపు ఎస్పీ సునీల్ కుమార్ మహంతి, ఆర్మ్‌డ్ బెటాలియన్ కమాండంట్ ఎ.కె.మహంతి పాల్గొన్నారు. వివిధ విభాగాల పోలీసుల గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి, గవర్నర్ కంభంపాటి హరిబాబు పోలీసుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పంపిన సందేశాన్ని ఎస్పీ చదివి వినిపించారు. అసువులు బాసిన పోలీసులకు నివాళులర్పించారు. పోలీసు విభాగంలో 2024, 2025 సంవత్సరానికి గాను ఎస్ఐ. ఏపీఆర్, హవల్దార్, డి.ఐ.వి. (విజిలెన్స్) విభాగంలో ఉత్తమ సేవలు అందించిన 11 మంది సిబ్బందికి నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లను ఎస్పీ అందజేశారు. ఎస్ఐ దొర, ఐఐసీ (ఆదర్శ పోలీసు స్టేషన్) ప్రశాంత్ భూపతి, హవల్దార్ డి.నాగేశ్వరరావు, ఎ.ఎస్.ఐ (జిల్లా ఇంటిలిజెన్స్) సురేంద్ర శెఠి, జగన్నాథ్ శోబోరో, సుజిత్ కుమార్ బెహరా, ఏపీఆర్ పోలీసులు ప్రభాకర్ బారిక్, ఘనశ్యాం ప్రధాన్, బిజయకుమార్ శోబోరో, అజిత్ కుమార్ పండా తదితరులకు ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేశారు.

మల్కన్‌గిరిలో ఘనంగా పోలీస్ స్థాపన దినోత్సవం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో 90వ పోలీస్ స్థాపన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ హెచ్.వినోద్ పటేల్ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టుల దాడుల్లో అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి సేవలను కొనియాడారు. 1936వ సంవత్సరంలో ఒడిశా పోలీస్ శాఖను స్వతంత్ర విభాగంగా ఏర్పాటు చేసినట్టు వివరించారు. అప్పటి నుంచి ఏప్రిల్ ఒకోటో తేదీ రోజును పోలీస్ స్థాపన దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ముఖ్యమంత్రి సందేశాన్ని ఎస్పీ చదివి వినిపించారు. విశేష సేవలు అందించిన పోలీసు సిబ్బంది అవార్డులు అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ తపాన్ నారాయణ్ రాతో, బీఎస్ఎఫ్ కమెండర్, ఇతర పోలీసులు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీస్ వ్యవస్థాపక దినోత్సవం

రాయగడ: రాష్ట్ర 90వ పోలీస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చందిలి రిజర్వ్ పోలీస్ మైదానంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వాతి పాల్గొని పతాకావిష్కరణ చేశారు. పోలీసుల సేవలను కొనియాడారు. అనంతరం ఉత్తమ పోలీసులకు అవార్డులను అందించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఘనంగా పోలీస్ అవతరణ దినోత్సవాలు

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రాల్లో 90వ ఒడిశా పోలీస్ అవతరణ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళ వారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం లోని పోలీస్ పరేడ్‌లో ఎస్పీ మిహిర్ కుమార్ పండా జెండా ఎగుర వేసి ఉత్సవాలు ప్రారంభించారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీస్ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని పోలీస్ రిజర్వ్ మైదానంలో పోలీస్ అవతరణ దినోత్సవాలు జరిగాయి. ఎస్పీ రోహిత్ వర్మ ఉత్తమ పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నబరంగ్‌పూర్ ఎస్పీ మిహిర్ పండా


కొరాపుట్‌లో ఉత్తమ పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ రోహిత్ వర్మ


పర్లాకిమిడి:పురస్కారం అందుకుంటున్న హవల్దార్ నాగేశ్వరరావు


మల్కన్‌గిరి: గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ వినోద్ పటేల్


రాయగడ: ఉత్తమ పోలీసులకు అవార్డులను అందజేస్తున్న ఎస్పీ స్వాతి


మల్కన్‌గిరి: పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు


పర్లాకిమిడి: ఐఐసీ ప్రశాంత భూపతికి పురస్కారం అందజేస్తున్న ఎస్పీ జి.ఎన్.పండా


కొరాపుట్‌లో పోలీసుల గౌరవ వందనం

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్లు

జయపురం: జయపురం ఆదర్శనగర్‌లో గల డీపీ అకాడమి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 19 ఏళ్ల లోపు క్రీడాకారుల మధ్య జరిగిన బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. మార్చి 29 నుంచి 31వ తేదీ వరకు పోటీలు నిర్వహించారు. ఫైనల్స్ పోటీలలో బాలికల సింగిల్స్‌లో గీతాశ్రీ డే విన్నర్‌గా, అన్సిక బిరోక్ రన్నర్‌గా నిలిచారు. బాలల సింగిల్స్ పోటీలో మయాంక భరద్వాజ్ విన్నర్‌గా, సోమ్యజిత్ సాహు రన్నర్‌గా సత్తా చాటారు. బాలుర డబుల్స్‌లో బహూన్ రౌత్, దవివ్యమ్ కేజరీవాల్ విన్నర్లుగా, శ్రీయాంశు జెన, శుభ్ర కేతన మల్లిక్ రన్నర్లుగా నిలిచారు. మిక్సిడ్ డబుల్స్‌లో జయేష్ అగర్వాల్, సీతి ప్రియ ప్రధాన్‌లు విన్నర్‌గా, అగస్త్య నాయక్, ఆధ్య పాడీలు రన్నర్స్‌గా నిలిచినట్లు నిర్వాహకులు వెల్లడించారు. బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పాల్గొన్నారు. జయపురంలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. 94 మంది క్రీడాకారులు పాల్గొన్నారని డీపీ అకాడమీ ప్రతినిధి నిమయి చరణ దాస్ వెల్లడించారు. విజేతలకు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, గౌరవ అతిథిగా పాల్గొన్న జయపురం సబ్‌కలెక్టర్ ఎ.శొశ్యరెడ్డి బహుమతులు అందజేశారు. ఒడిశా బ్యాడ్మింటన్ సంఘం రిఫరీ లక్షపతి నందా, పర్యవేక్షకులు సందీప్ మిశ్ర, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కో ఆర్డినేటర్ సంతోష్ బెవర్త, రాయగడ జిల్లా సంఘ కార్యదర్శి సురేష్ చంద్ర పండా, కొరాపుట్ జిల్లా సంఘ కార్యదర్శి శైలేష్ కుమార్ చౌదరి, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘ సభ్యులు ఆశ్రిత పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మిక్స్‌డ్ పోటీలోరన్నర్, విన్నర్ టీమ్‌లు


డబుల్స్‌లో ఉత్కంఠగా సాగిన పోటీ


సింగిల్స్‌లో తలపడిన బాలికలు

వర్ధమాన కళాకారులకు ఆదరణ

భువనేశ్వర్: విద్య, కళలు, సాహిత్యం, క్రీడలు, నృత్యం తదితర రంగాల్లో ఔత్సాహిక వ్యక్తులకు ప్రత్యేక ఆదరణ కల్పించనున్నట్లు జట్నీ తెలుగు సంక్షేమ సంఘం ప్రకటించింది. ఈ ఏడాది తెలుగు సంవత్సరాది పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కార్యవర్గ సభ్యులు మంగళవారం తెలిపారు. నటనా రంగంలో రాణిస్తున్న వర్ధమాన కళాకారులకు ఉత్సవ వేదికపై ప్రత్యేకంగా సత్కరించారు. ఒడియా చలన చిత్ర నటీనటులు సవ్యసాచి, అర్పిత, ఎఫ్ఎం బాబాయి, హాస్య సంభాషణ రచయిత రాము తదితర ప్రముఖులకు ప్రోత్సాహక పురస్కారాలు ప్రదానం చేశారు. ఆచార, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సాంఘిక కార్యకలాపాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. సత్కార గ్రహీతలు వేదికపై ప్రదర్శించిన హాస్య ప్రదర్శన ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్వించింది.



హై టెక్ రిక్షా హాస్య ప్రదర్శనలో ఎఫ్ఎం బాబాయ్, రాము



నటీనటులు సవ్యసాచి, అర్పితకు ఉగాది సత్కారం

ముగిసిన ఉగాది సంబరాలు


ముగింపు వేడుకల్లో జనం సందడి

రాయగడ: స్థానిక తేజస్వీ మైదానంలో రాజ్యసభ మాజీ సభ్యుడు, రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షులు నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరిగిన ఉగాది ఉత్సవాలు సోమవారం రాత్రితో అంగరంగ వైభవంగా ముగిశాయి. ప్రముఖ సినీ నేపథ్య గాయని మంగ్లీ, గాయకులు అనిరుధ్, ఇండియన్ ఐడల్ గాయకులు కౌసల్య భీమశెఠి శ్రీనివాస్‌లు ముగింపు ఉత్సవాల్లో అలరించారు. రెండున్నర గంటల పాటుగా మంగ్లీ ఆలపించిన పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. దాని కుడిభుజం మీద కడవ వంటి పాటలతో పాటు జానపదం, సినీ గీతాలు పాడి అలరించారు. శ్రీనివాస్, సౌజన్యలు పాడిన పాటలు ప్రేక్షకులను మైమరపించాయి. జనం మధ్యలోకి వెళ్లి మంగ్లీ పాడటంతో దానికి అనుగుణంగా ప్రేక్షకులు నృత్యాలతో వేదిక హోరెత్తింది. ఉగాదిని పురస్కరించుకుని అమలాభట్ట వద్ద గల శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లోని శ్రీలక్ష్మీనృసింహా మందిరం ప్రాంగణంలో రంగోళి, డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన వితేతలకు ఈ వేదికపై బహుమతులను ప్రదానం చేశారు.

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం

12 ఏళ్లుగా రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ పేరిట ఉత్సవాలు పట్టణంలో జరుగుతున్నాయి. ఈ ఏడాది కూడా ఈ వేడుకలు అందరి సహాయ, సహకారాలతో ఘనంగా ముగిశాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను నిరంతరం నిర్వహించుకోవాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. భావితరాల వారు కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. తెలుగు ప్రజల ఐక్యతకు అద్దం పట్టే ఉగాది వేడుకల్లో అందరూ భాగస్వాములు అయితేనే కార్యక్రమాలు విజయవంతమవుతాయని చెప్పారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.


గాయని మంగ్లీనిసన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు


వేడుకలకు వచ్చిన వారికి విందు ఏర్పాట్లలో నిర్వాహకులు


జనం మధ్యలోకి వచ్చి పాడుతున్న మంగ్లీ


గాయకులు సౌజన్య, శ్రీనివాస్‌లు

క్లుప్తంగా

వంశధార నది దాటిన జంట ఏనుగులు



వంశధార నది గుండా తరలి వెళ్తున్న ఏనుగుల జంట

భామిని: మండలంలోని బిల్లుమడ రైతులు ఊపిరి పీల్చుకున్నారు. భామిని మండలం బిల్లుమడకు చేరిన జంట ఏనుగులు ఘీంకరిస్తూ మంగళవారం వంశధార నదిని దాటాయి. ఇప్పటికే ఒడిశా గ్రామాల్లో మరో రెండు ఏనుగుల జట్టు వీడిన రెండు ఏనుగుల జంట కోసం పాకులాడుతున్నట్లు తెలిసింది. వంశధార నదీ తీరంలోని ఒడిశాకు చెందిన పురిటిగూడ-గౌరీ గ్రామాల మధ్య రెండు ఏనుగుల జంటలు కలిసి ఊరట చెందాయని స్థానిక రైతులు తెలిపారు.

రజక సంఘం పట్టణ నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీ ఎంపిక పత్రాన్ని అధ్యక్షుడికి అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉమ్మడి విజయనగరం, జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో విజయనగరం పట్టణ నూతన కమిటీ ఎంపిక మంగళవారం కార్యాలయంలో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా కోనాడ పైడిచిట్టి, ఉపాధ్యక్షుడిగా రామనేంద్రపు సురేష్, కార్యదర్శిగా కొవ్వూరి అప్పలరాజు, సహాయ కార్యదర్శిగా ముత్యాల సతీష్, కోశాధికారిగా జంపా నాగరాజు, కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అప్పికొండ సన్యాసిరావు, తంగేటి భాస్కరరావు, జంపా చిన్న, మడిపల్లి రాజారావు, సురేష్, శంకర్, రాజా, సురేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

100 సారా ప్యాకెట్లు స్వాధీనం

పార్వతీపురం రూరల్: పట్టణ పోలీసులు తనిఖీల్లో భాగంగా పట్టణంలో గల పాత రెల్లివీధిలో వంద సారా ప్యాకెట్లతో మీసాల శివకుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు టౌన్ ఎస్సై గోవింద మంగళవారం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడి మృతి



రాహుల్ (ఫైల్)

సీతంపేట: మండలంలోని కిల్లాడ గ్రామానికి చెందిన వూయక రాహుల్ (20) అనే గిరిజన యువకుడు వలస వెళ్లి అక్కడ విద్యుత్ షాక్‌తో రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉపాధి లేక పొట్ట చేతబట్టుకుని కొద్ది నెలల కిందట మచిలీపట్నం వలసవెళ్లాడు. అక్కడ చేపల చెరువుకు కాపలాగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగానే గతనెల 31న చేపలచెరువుకు వెళ్లి పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మరణించాడు. కుమారుడి మృతివార్త విన్న తల్లిదండ్రులు తిరుపతిరావు,నీలమ్మలు గుండెలవిసేలా రోదించారు. స్వగ్రామం కిల్లాడలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

147 కేజీల గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు



నిందితులను చూపిస్తున్న ఎస్పీ. చిత్రంలో బొబ్బిలి డీఎస్పీ భవ్య, సీఐ నారాయణరావు, రామభద్రపురం ఎస్సై ప్రసాదరావు

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గడిచిన వారం రోజుల్లో భారీ స్థాయిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా 147కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చూపించారు. గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలానికి చెందిన బోగవిల్లి గోవిందరావు, సాగుపిల్లి అనిల్ కుమార్, బంక రామసురేష్, అంబిడి బాలరాజులు రామభద్రపురం మండలంలోని కొట్టక్కి జంక్షన్ వద్ద గంజాయి విక్రయానికి పాల్పడుతున్నట్లు అందిన పక్కా సమాచారంతో రామభద్రపురం పోలీసులు, ఆ నలుగురు నిందితులను అదుపులోకి ప్రశ్నించడంతో గంజాయి సరఫరా గుట్టు రట్టైందని ఎస్పీ చెప్పారు. దీంతో నిందితుల దగ్గర ఉన్న 147 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

పోలీస్ స్టేషన్ ముట్టడి!

రాయగడ:

తన డ్రైవర్‌ను అరెస్టు చేశారంటూ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు యాల్ల కొండబాబు, అతని అనుచరులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ముట్టడి ఘెరావ్ చేశారు. స్టేషన్ ఎదుట లారీలను రోడ్డుకు అడ్డంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. సుమారు ఏడు గంటలు ట్రాఫిక్ స్తంభించింది. ఇటు ఆంధ్రకు వచ్చివేళ్లే వాహనాలు సుమారు ఆరు కిలోమీటర్లు నిలిచి పోయాయి. అలాగే రాయగడ మీదుగా కొరాపుట్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు సైతం నిలిచిపోయాయి.

నోటీసు ఇవ్వకుండా అరెస్టు చేశారు..

తన కారు డ్రైవరు శంకరావునుని మంగళవారం తెల్లవారుజాము మూడు గంటలకు ఇంటికి వెళ్లి పోలీసులు అరెస్టు చేసి తీసుకువచ్చారని కొండబాబు ఆరోపించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అతనిని అరెస్టు చేయడం ఎంతవరకు సమసంజసమని ప్రశ్నించారు. నక్సలైట్ల పేరిట చందాలు వసూళ్లు చేసే బడా నాయకులపై కేసులు ఉన్నా వారిని అరెస్టు చేయని పోలీసులు చిన్నవారిపై తమ జులుంను చూపించడం తగదన్నారు . మంగళవారం ఉదయం ఐదు గంటలకు పోలీస్ స్టేషన్ ఎదుట ఆయన మద్దతుదారులు బైఠాయించి నిరసన తెలియజేశారు. డ్రైవరును విడిచి పెట్టే వరకు ఆందోళన విరమించేది లేదని పట్టుబట్టారు. జిల్లా అదనపు ఎస్పీ అమూల్య ధర్, ఎస్‌డీపీవో గౌరహరి సాహులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఐదేళ్ల క్రితం ఒక కేసుకు సంబంధించి డ్రైవర్ శంకరరావుకు నోటీసులు పంపిస్తున్నా దానిని తిరస్కరించేవాడని.. దీంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు అతనిని అరెస్టు చేయాల్సి వచ్చిందని ఉన్నతాధికారులు వివరించారు. చట్టపరంగా అతన్ని అరెస్టు చేశామే తప్పా ఎవరి ఒత్తిడికి లొంగి అరెస్టు చేయలేదని వివరించారు. ఏదిఏమైనప్పటికీ అరెస్టు చేసిన వ్యక్తికి కోర్టుకు తరలించడం ఖాయమని చెప్పడంతో కొండబాబు తన ఆరాదోళలనను విరమించారు.



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన కొండబాబు, అతని మద్దతుదారులు



రోడ్డుమధ్యలో లారీలను నిలిపివేయడంతో స్తంభించిన ట్రాఫిక్



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న లారీ యజమానులు, డ్రైవర్లు

వారి క్రమశిక్షణ స్ఫూర్తిదాయకం



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

- ఆత్మీయ వీడ్కోలు సభలో ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: సుదీర్ఘ కాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పోలీస్‌కంట్రోల్ రూమ్ ఎస్సై ఎన్ని సత్యానందరావు, గుర్ల పీఎస్ హెచ్‌సీ ఎ.భాస్కరరావులకు ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్, మాట్లాడుతూ పోలీసుశాఖలో సుదీర్ఘ కాలం మంచి సేవలందించి నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్సై ఎన్ని సత్యానందరావు, హెడ్ కానిస్టేబుల్ అదపాక భాస్కరరావులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు విధులను నిర్వహించడంలో క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసి, ఇతర పోలీసు ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ప్రశంసించారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని ఎస్పీ వకుల్ జిందల్ భరోసా కల్పించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన ఎస్సై ఎన్ని సత్యానందరావు దంపతులను, హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు దంపతులను పోలీసుశాఖ తరపున ఎస్పీ వకుల్ జిందల్ శాలువాలు, పూలమాలలు, గిఫ్ట్, సన్మాన పత్రాలతో సత్కరించి, ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, ఎస్బీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, కంట్రోల్ రూమ్ సీఐ వైకుంఠరావు, ఎస్సైలు జగదీశ్వరరావు, శంకర్రావు, పోలీస్ అసోసియేషన్ అడహాక్ సభ్యుడు కె.శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ కార్యదర్శి నీలకంఠం నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్ ద్వారా 'డైట్' అధ్యాపక ఖాళీల భర్తీ

- 16, 17వ తేదీల్లో రాత పరీక్ష



యు.మాణిక్యం నాయుడు, డీఈఓ

విజయనగరం అర్బన్: డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని ఫారిన్ సర్వీస్ నియామక నిబంధనల మేరకు డిప్యుటేషన్ పద్ధతిలో నియామకం చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు డీఈఓ యు.మాణిక్యం నాయుడు మంగళవారం విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డీఈఓల ద్వారా సంబంధిత ప్రిన్సిపాల్స్‌కు దరఖాస్తులు సమర్పించుకోవాలి. 11 నుంచి 13వ తేదీల మధ్యలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. అర్హత పొందిన దరఖాస్తుదారులకు ఈ నెల 16, 17వ తేదీల్లో రాత పరీక్ష, 19వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అర్హులైన వారికి డిప్యుటేషన్ ఉత్తర్వులు ఈ నెల 21వ తేదీన అందజేస్తారు. 22వ తేదీనే విధుల్లో చేరాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 'డీఈఓ విజయనగరం' వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వడదెబ్బతో వృద్ధురాలు..



గౌరమ్మ మృతదేహం

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని ముచ్చర్లవీధికి చెందిన మంతిన గౌరమ్మ(85) వడదెబ్బతో మృతి చెందినట్లు వీధివాసులు తెలిపారు. వారం రోజులుగా ఎండల తీవ్రత ఎక్కుగా ఉండడంతోనే వృద్ధురాలు మృతి చెందిందని స్థానికులు అంటున్నారు. మంగళవారం ఉదయం పింఛన్ తీసుకున్న తర్వాత కొద్ది సేపటికే మృతి చెందినట్లు స్థానికులు చెప్పారు. ఆమెకు కుటుంబసభ్యులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో వీధిలో ఉన్నవారే ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు.

అంగరంగ వైభవంగా పోలమాంబ చండీహోమం

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజన ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి 10వ జాతర మహోత్సవాల్లో భాగంగా అంగరంగ వైభవంగా మంగళవారం చండీహోమం కార్యక్రమం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి ఆలయాల్లో కొలువైన పోలమాంబ అమ్మవార్లకు ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. చదురుగుడి వద్ద 11 హోమగుండాలను ఏర్పాటుచేసి, వేద పండితులు అంపోలు రుద్ర కోటేశ్వర శర్మ, డీఎల్ ప్రసాదరావు, బాలబాబు శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు . పూర్ణాహుతి కార్యక్రమంలో గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణు గోపాల్ నాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు, సీనియర్ సహాయకులు శ్రీనివాసరాజు, సర్పంచ్ వెదుళ్ల సింహాచలమమ్మ, ఎంపీటీసీ టి.పోలి నాయుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు నైదాన తిరుపతిరావు, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌లు పూడి దాలినాయుడు, వసంతల భాస్కరరావు, గంజి కాశినాయుడు, మావుడి మాజీ సర్పంచ్ అక్యాన తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



పోలమాంబ అమ్మవారు మూలవిరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు





పోలమాంబ అమ్మవారు, చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం , కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

ఉపాధి హామీ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు

విజయనగరం ఫోర్ట్: ఉపాధి వేతన దారులకు బకాయి ఉన్న 9 నుంచి 13 వారాల ఉపాధి హామీ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ చట్టం ఉద్దేశానికి నేటి పాలకులు, అధికారులు తూట్లు పొడుస్తున్నారన్నారు. పనులు కావాలన్న వారికి 15 రోజులకు పనులు ఇవ్వాలని, లేని పక్షంలో 16వ రోజు నుంచి కార్మికులకు భృతి చెల్లించాలని చట్టం చెబుతున్నా చాలా గ్రామాల్లో ఇది అమలు కావడం లేదన్నారు. వేతనదారులకు 9 నుంచి 13 వారాల పాటు బిల్లులు చెల్లించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమన్వయంతో శ్రీరామనవమిని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాట్ల కీర్తి

- ఆర్డీఓ దాట్ల కీర్తి
- శ్రీరామనవమి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

నెల్లిమర్ల రూరల్:

ఈ నెల 6న రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రామతీర్థంలో జరగనున్న శ్రీరామనవమి వేడుకలను అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీఓ దాట్ల కీర్తి సూచించారు. ఈ మేరకు మండలంలోని రామతీర్థంలో కల్యాణం ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఒక్కో శాఖకు చెందిన అధికారితో మాట్లాడి చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..స్వామి కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కల్యాణ వేదిక చుట్టూ టెంట్లు ఏర్పాటు చేయాలని భక్తులకు మజ్జిగ, నీరు సరఫరా చేయాలని చెప్పారు. ఆలయం వెలుపల, కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఫైర్, పోలీస్, దేవాదాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. కల్యాణం అనంతరం స్వామి తలంబ్రాల పంపిణీ ప్రక్రియ ప్రధాన ఘట్టమని, ఆ ప్రక్రియలో ఎటువంటి తోపులాటలు జరగకుండా క్యూలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్యాణ వేదికపైకి భక్తులు వెళ్లకుండా పోలీసులు చూసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, 108, 104, ఫైర్ ఇంజిన్ వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం తరపున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ వై శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ వెంకటేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఫైర్ అధికారి రాం ప్రకాష్, తహసీల్దార్ సుదర్శనరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, నాయకులు సువ్వాడ రవిశేఖర్, కంచరాపు రాము, గేదెల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.




కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్ల పరిశీలన

కానిస్టేబుల్‌నని చెప్పి.. సైబర్ మోసం..!



- రూ.28 వేలు ఫోన్‌పే చేసిన బాధితుడు
- లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వీరఘట్టం: హలో.. నేను వీరఘట్టం కానిస్టేబల్‌ను. ఎస్సై గారు హాస్పిటల్‌లో ఉన్నారు. అర్జెంట్‌గా రూ.55 వేలు కావాలి. నా వద్ద క్యాష్ ఉంది. మీరు ఫోన్‌పే చేస్తే క్యాష్ ఇచ్చేస్తానని నమ్మబలికాడో సైబర్ కేటుగాడు. అర్జెంట్ అంటూ పదే పదే ఫోన్ చేయడంతో అతను చెప్పింది నిజమేనని నమ్మిన వీరఘట్టానికి చెందిన ప్రతాప్ అనే వ్యక్తి సోమవారం రూ.28 వేలు ఫోన్‌పే చేశాడు. ఫోన్‌పే కొట్టిన పది నిమిషాల్లో అవతలి వ్యక్తి ఫోన్ స్విచాఫ్ అయ్యింది. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆరా తీస్తే అటువంటి వ్యక్తి ఇక్కడ ఎవరూ లేరని తేలింది. అంతేకాకుండా ఎస్సై కళాధర్ విధుల్లో ఉన్నారు. దీంతో తాను మోసపోయానని ప్రతాప్‌కు అర్థమైంది. తనకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



పోలీసులు ఆరా తీయగా వచ్చిన సైబర్ కేటుగాడి వివరాలు

కొంప ముంచిన వాట్సాప్ గ్రూప్..


వీరఘట్టం, పాలకొండ, పార్వతీపురానికి చెందిన 469 వ్యాపారులు,ఇతర ఉద్యోగులు, సామాన్యులు అందరూ కలిసి 'వి.జి.టి.యం నీడ్ మనీ ట్రాన్స్‌ఫర్స్ వీరఘట్టం' అనే వాట్సాప్ గ్రూప్‌లో ఉన్నారు.ఎవరికైనా డబ్బులు కావాలన్నా, ఫోన్ పే కావాలన్నా ఒకరికొకరు పరిచయస్తులు కావడంతో సులువుగా మనీ ట్రాన్స్‌ఫర్ చేసుకుంటూ ఏడాది కాలంగా ఈ గ్రూప్ నడుస్తోంది.ఈ గ్రూప్‌లో మెసేజ్ రావడంతో ఇదే గ్రూపులో ఉన్న ప్రతాప్ అవతల వ్యక్తిని నమ్మి మోసపోయాడు. ఈ వాట్సాప్ గ్రూప్ నా కొంప ముంచిందంటూ లబోదిబోమంటున్నాడు.

స్విచాఫ్ అయిన నంబర్..

ప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు 7569341175 నంబర్ వివరాలు ఆరా తీయగా ఈ నంబర్ మోశ్యా శ్రీరామ్ అనే పేరు మీద ఉంది.అడ్రస్‌ను పరిశీలించగా సన్ ఆఫ్ మోశ్యా బలరాం బేటా, తాజంగి, చింతపల్లి, విశాఖపట్నం-531116 అని ఉంది. ఆ ఫోన్ నంబర్ మాత్రం స్విచాఫ్ వస్తోంది. విజ్ఞత గల వ్యాపారులు ఇటువంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హితవు పలుకుతున్నారు.

జరిగిన విషయం ఇదీ..

వీరఘట్టం బార్నాలవీధి రోడ్డులో ఎరువుల షాపు నిర్వహిస్తున్న లోకేష్ అనే వ్యక్తికి 7569341175 అనే నంబర్ నుంచి సోమవారం ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. వీరఘట్టం పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్‌ను అని చెప్పి ఎస్సై హాస్పిటల్‌లో ఉన్నారు. అర్జెంట్‌గా రూ.55వేలు కావాలని అడిగాడు. అయితే తన వద్ద డబ్బులు లేవని, మా ఫ్రెండ్‌ను అడుగుతానని దగ్గరలో ఉన్న స్వీట్ షాప్ యజమాని సంతోష్‌కు లోకేష్ ఫోన్ చేసి కానిస్టేబుల్ అని చెప్పిన వ్యక్తి ఫోన్ నంబర్ ఇచ్చాడు.దీంతో సంతోష్ అనే వ్యక్తి 'వి.జి.టి.యం నీడ్ మనీ ట్రాన్స్‌ఫర్స్ వీరఘట్టం ' అనే వాట్సాప్ గ్రూప్‌లో అర్జెంట్‌గా ఓ వ్యక్తికి రూ.55 వేలు కావాలంట..ప్లీజ్ కాంటాక్ట్ అని 7569341175 నంబర్‌ను గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఇదే గ్రూపులో ఉన్న ప్రతాప్ అనే వ్యక్తికి క్యాష్ అవసరం ఉండడంతో ఆ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేశాడు. తన వద్ద రూ.28 వేలు మాత్రమే ఉన్నాయని, మీరు సంతోష్‌కు క్యాష్ ఇచ్చేయండి మీకు ఫోన్‌పే చేస్తానని చెప్పాడు.దీంతో వారి మధ్య కొంతసేపు ఫోన్ సంభాషణ జరగ్గా అతను వీరఘట్టానికి చెందిన కానిస్టేబుల్ అని నమ్మిన ప్రతాప్ అతని ఫోన్ నంబర్‌కు రూ.28 వేలు ఫోన్ పే చేశాడు. వెంటనే అవతలి వ్యక్తి ఫోన్ నంబర్ స్విచాఫ్ రావడంతో తాను మోసపోయానని ప్రతాప్ గ్రహించి చివరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనకు న్యాయం చేయాలని మంగళవారం ఫిర్యాదు చేశాడు.



ప్రతాప్ కొట్టిన రూ.28 వేల ఫోన్‌పే రిసీప్ట్